క్లుప్తంగా

లక్ష్మీనారాయణస్వామివారికి విశేష పూజలు



కల్యాణోత్సవానికి హాజరైన భక్తులు (ఇన్‌సెట్) అభిషేకం చేస్తున్న అర్చకులు

గంగాధరనెల్లూరు: వేపంజేరిలోని లక్ష్మీనారాయణస్వామి ఆలయంలో ఆదివారం విశేష పూజలు నిర్వహించారు. వేకువజామున సుప్రభాత సేవలో స్వామివారిని మేల్కొలిపి నిత్య కైంకర్యాలు జరిపారు. సుగంధభరిత ద్రవ్యాలతో అభిషేకం చేశారు. భక్తులకు దర్శనం కల్పించారు. ఆలయ దశావతార పుష్కరిణి ఆవరణలో గోశాలలో గోపూజ చేశారు. భక్తులు గోమాతకు పూజలు చేసి ప్రదక్షిణలు చేశారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు.

ప్రకృతి సేద్యంతో అధిక దిగుబడులు



మాట్లాడుతున్న డీపీఎం వాసు

పాలసముద్రం: ప్రకృతి వ్యవసాయంతో అధిక దిగుబడులతోపాటు అధిక ఆదాయం సాధించవచ్చని చిత్తూరు ఏపీపీఎస్‌ఎఫ్ డీపీఎం వాసు తెలిపారు. ఆదివారం శ్రీకావేరిరాజుపురం మిట్ట దళితవాడలో సర్పంచ్ గాలి మహేష్ బాబు అధ్యక్షతన ప్రకృతి వ్యవసాయంపై అవగాహన సదస్సు నిర్వహించారు. డీపీఎం వాసు మాట్లాడుతూ రసాయన ఎరువులు, పురుగు మందుల వినియోగంతో భూమితోపాటు వాతావరణ కాలుష్యం జరిగి ప్రజలు అనారోగ్యం పాలవుతున్నారని తెలిపారు. ఈ నేపథ్యంలో రైతులంతా ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించాలని సూచించారు. కార్యక్రమంలో పీఆర్పీ ఉష, ఐసీఆర్పీ ప్రతాప్, నిర్మల తదితరులు పాల్గొన్నారు.

రామ్మోహన్‌రావ్‌కు నివాళి



నివాళులర్పిస్తున్న యూనియన్ నాయకులు

పుత్తూరు రూరల్: నేషనల్ మజ్దూర్ యూనియన్ అసోసియేషన్ (ఎన్‌ఎంయుఏ) వ్యవస్థాపకులు రామ్మోహన్‌రావ్ వర్ధంతిని ఆదివారం పుత్తూరు ఆర్టీసీ డిపోలో ఘనంగా నిర్వహించారు. డిపో ఆవరణలో రామ్మోహన్‌రావ్ చిత్రపటానికి యూనియన్ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం తిరుపతి జిల్లా అధ్యక్షుడు ఎస్‌జే పెరుమాళ్ ఆధ్వర్యంలో పేదలకు అన్నదానం నిర్వహించారు. జోనల్ కమిటీ సభ్యుడు ఆర్ముగం, డిపో అధ్యక్ష, కార్యదర్శులు ఎస్ సుందరం, ఎం శివకుమార్, గ్యారేజ్ అధ్యక్ష కార్యదర్శులు రమేష్, దొరబాబు పాల్గొన్నారు.

నేడు మండల మీట్

పాలసముద్రం: మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం మండల సాధారణ సర్వ సభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీపీ ఎస్ శ్యామల, ఎంపీడీఓ ఎస్ విద్యావతి తెలిపారు. ఆదివారం వారు విలేకరులతో మాట్లాడుతూ మండలంలో అభివృద్ధి పనులకు సంబంధించిన ప్రణాళికలతో అన్ని శాఖల అధికారులు సమావేశానికి హాజరుకావాలన్నారు. ప్రస్తుతం ఎండల తీవ్రత ఎక్కువగా ఉన్న నేపథ్యంలో నీటి సమస్య ఉన్న గ్రామాల జాబితా తీసుకు రావాలని తెలిపారు.

రోడ్లు తళతళ



నగరి: రహదారులు తళతళ మెరిసిపోతున్నాయి. నియోజకవర్గ పరిధిలో రోడ్లు అద్దంలా కనిపిస్తున్నాయి. గతంలో వర్షాలకు ఛిద్రమై, రోడ్లపైన రాళ్లు తేలడంతో ప్రయాణికులు, వాహనచోదకులు ఇబ్బంది పడేవారు. ఈ నేపథ్యంలో జీవీఎంసీ నిధులతో రహదారులకు మరమ్మతులు, నిర్మాణం చేపట్టడంతో ప్రయాణికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

సమాజాభివృద్ధిలో మహిళల పాత్ర కీలకం



బ్యాడ్మింటన్ ఆడుతున్న మహిళా ఉద్యోగులు

పుత్తూరు రూరల్: సమాజాభివృద్ధిలో మహిళలు కీలక పాత్ర పోషిస్తున్నారని పుత్తూరు తపాలా శాఖ సబ్ డివిజనల్ ఇన్‌స్పెక్టర్ నరసింహప్రసాద్ పేర్కొన్నారు. ఆదివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవ వారోత్సవాల్లో భాగంగా స్థానిక ఎస్‌ఆర్‌ఎస్ కళాశాల గ్రౌండ్‌లో పోస్టల్ మహిళా ఉద్యోగులకు క్రీడా పోటీలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ నేటి సమాజంలో మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారని చెప్పారు. పనిభారంతో కలిగే మానసిక ఒత్తిడిని జయించడానికి క్రీడలు అవసరమని తెలిపారు. పోటీలలో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు.

శునక దండుయాత్ర

- కుక్కల స్వైర విహారం
- వీధుల్లో శునకాల హవా
- బెంబేలెత్తుతున్న జనం

తెలిసిన ఊరే.. రోజు తిరిగే వీధే.. తాముండే గ్రామమే..అయినా రాత్రి వేళ ఒంటరిగా వెళ్లాలంటే భయం..వాహనంలో రావాలంటే వణుకు.. గ్రామ సింహాలు పరుగున వచ్చి మీద పిక్కలు పీకేస్తున్నాయి. పగలు పశువులు, కోళ్లు, మూగజీవులపై దాడులు చేసి, చంపేస్తున్నాయి. వీధివీధినా గ్రామసింహాలు హవా నడుస్తోంది.. ఫలితంగా జనం బెంబేలెత్తున్నారు.



శ్రీకావేరిరాజుపురంలో సంచరిస్తున్న శునకాల గుంపు

పాలసముద్రం: గ్రామీణ ప్రాంతాల్లో కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. పగలనకా రేయనకా కుక్కల బెడదతో ప్రజలు బెంబేలెత్తున్నారు. రోడ్లు, ప్రధాన రహదారులపై కుక్కలు గుంపుల గుంపులుగా సంచరిస్తుండడంతో జనులు, వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇదిలా ఉండగా చిన్న పిల్లలు కుక్కల భయానికి ఇళ్ల నుంచి బయటకు రాలేకపోతున్నారు. శునకాలు పాఠశాలల వద్ద పహారా కాస్తుండడంతో ఇబ్బందులు పడుతున్నారని పిల్లల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రధానంగా ద్విచక్రవాహనచోదకులు ప్రాణాలను గుప్పెట్లో పెట్టుకుని, వాహనాలను నడుపుతున్నారు. పాలసముద్రం మండలంలో 13 పంచాయతీల్లోనూ శునకాల బెడద అధికంగా ఉంది. ముఖ్యంగా వెంగళరాజుకుప్పం, శ్రీకావేరిరాజపురం, పాలసముద్రం, తిరుమలరాజపురం, సింహరాజపురం తదితర గ్రామాల్లో వీధివీధిలో కుక్కలు గుంపులు గుంపులుగా సంచరిస్తున్నాయి. శునకాలు గ్రామాల్లో స్వైరవిహారం చేస్తుండడంతో ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురవతున్నారు. రాత్రి పూట కుక్కల అరుపులకు ప్రజలు నిద్రలేమితో అవస్థలు పడుతున్నారు. కుక్కల దాడికి పశువులు, మేకలు, గొర్రెలు తీవ్రగాయాల పాలవుతున్నట్లు కాపరులు అంటున్నారు. ఆదివారం శునకాల దాడిలో శ్రీకావేరిరాజుపురంలోని గోవిందమండికి చెందిన ఆరు గొర్రెపిల్లలు మృతి చెందాయి. కుక్కలు నియంత్రించాలని పలుమార్లు అధికారులకు విన్నవించుకున్నా పట్టించుకోవడం లేదని ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా స్పందించి కుక్కల నియంత్రణకు తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

కుక్కల దాడిలో ఆరు గొర్రె పిల్లల మృతి



వీధి కుక్కల దాడిలో మృతి చెందిన గొర్రెపిల్లలు

పాలసముద్రం: మండలంలోని శ్రీకావేరిరాజుపురం గ్రామంలో గోవిందమండడి మందలో ఉన్న గొర్రెపిల్లలపై ఆదివారం వీధి కుక్కల దాడి చేశాయి. ఈ ఘటనలో ఆరు గొర్రె పిల్లలు మరణించాయి. బాధితుడి కథనం మేరకు.. శ్రీకావేరిరాజుపురంలోని గోవిందమండడి గొర్రెలను పోషిస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఆదివారం ఉదయం గొర్రె పిల్లలను దొడ్డిలో ఉంచి, గొర్రెలను మేతకు తీసుకెళ్లాడు. మధ్యాహ్నం భోజనానికి ఇంటికి వచ్చి దొడ్లో చూడగా ఆరు గొర్రెపిల్లలు చనిపోయి ఉండడాన్ని గమనించాడు. ఏడాదిగా ఎండకు, వానకు కొండల్లో తిరిగి గొర్రెలను మేపుతున్నానని, ఆరేడు నెలలు పోషిస్తే చిన్నపిల్లలు పెద్దవైతే విక్రయించుకుని అప్పులు తీర్చుకోవాలనుకున్నానని, అయితే ఇలా కుక్కలు వాటిని పొట్టన పెట్టుకున్నాయని ఆవేదన వ్యక్తం చేశాడు.

మేక, గొర్రె పిల్లలను వెంటాడుతున్నాయ్



వీధి కుక్కలు భయం ఎక్కువగా ఉంది. ఎక్కడ చూసిన శునకాలు గుంపులు గుంపులుగా తిరుగుతున్నాయి. లేగ దూడలు, మేక, గొర్రె పిల్లలను బయట వదలాంటే భయంగా ఉంది. లేగ దూడలు, మేక పిల్లలపై కూడా కుక్కలు దాడులు చేస్తున్నాయి. రెండు రోజుల కిందట మా కోడి పుంజుని నోట కరుచుకుని వెళ్లింది. ఊరి చివరకు తీసుకెళ్లి తినేసింది.

–వడివేలురెడ్డి, సీఎం కండ్రిగ,

ఒంటరిగా రావాలంటే భయం



కూలీ పనులకు వెళ్లి రాత్రి 8 గంటల సమయంలో వాహనాల్లో రావాలన్నా, ఒంటరిగా గ్రామంలో తిరగాలన్నా భయంగా ఉంది. బౌ.. బౌమంటూ కుక్కలు గుంపుగా వచ్చి దాడులు చేస్తున్నాయి. వృద్ధులు, మహిళలు, వీధుల్లోకి వెళితే దాడులు చేసి, కాటు వేస్తున్నాయి. పంచాయతీ అధికారులు వెంటనే స్పందించి వీధి కుక్కలను నియంత్రించాల్సి ఉంది.

–జీ.గణేష్‌రెడ్డి, వినాయకపురం

పిల్లలు వీధుల్లోకి వెళితే అంతే..



పిల్లలు ఆట్లాడుకునేందుకు వీధుల్లోకి వెళితే కుక్కలు కాటు వేస్తున్నాయి. వారం రోజుల కిందట దర్శన్ అనే చిన్నారి పాఠశాలకు వెళ్లి, తిరిగి ఇంటికి వస్తుండగా కుక్కలు దాడి చేసి, కరిచాయి. రక్త కారుతూ ఇంటికి వచ్చాడు. చిన్నపిల్లలు వీధుల్లోకి వెళితే ఎప్పుడు ఏ కుక్క కరుస్తుందోనని భయపడాల్సి వస్తోంది.

–ఆర్. గౌతమి, కన్నికాపురం, దళితవాడ

శేషుడిపై లక్ష్మీనరసింహుడి విహారం

శ్రీరంగరాజపురం: మండలంలోని మంగుంటలో ఉన్న లక్ష్మీనరసింహస్వామి ఎనిమిదో వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఉదయం 6 గంటలకు స్వామివారికి సుప్రభాతం, అభిషేకం, 9 గంటలకు యాగశాల, ప్రవేశ ఆరాధన గణపతి పూజ, రక్షాబంధన వాసుదేవా పుణ్యాహవచనం, కలశ ఆరాధన, అంకురార్పణ హోమం నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. అనంతరం శేషవాహనంపై లక్ష్మీనరసింహ స్వామివారిని పురవీధుల్లో ఊరేగించారు. ధర్మకర్తలు గిరి, కుమారి, గుణశేఖర్ నాయుడు, ఆలయ ధర్మకర్త ప్రసాద్ రెడ్డి, అర్చకులు రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

ఘనంగా వార్షిక పూజలు



విశేషాలంకరణలో ఉత్సవ మూర్తులు

వెదురుకుప్పం: మండలంలోని చిన్నకొమరగుంటలో ఉన్న పద్మావతి ఆండాల్ సమేత వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఆరో వార్సికోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఈ సందర్భంగా ఆలయంలో స్వామివారి మూలరాట్‌కు విశేష పూజలు చేశారు. ఆదివారం అగ్నిప్రతిష్ఠ చేశారు. ఆలయ ఆవరణలో ఉత్సమూర్తులను వేంచేపు చేసి సుంగధపరిమళాలు వెదజల్లే పుష్పాలతో స్వామివారి ఉత్సవ మూర్తులకు విశేషాలంకరణ చేసి, విశేష పూజలు చేపట్టారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. సోమవారం ఆలయంలో ధ్వజావరోహణం కార్యక్రమం జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు.

వాహనాల తనిఖీ



రికార్డులు తనిఖీ చేస్తున్న ఎస్‌ఐ

నగరి: పట్టణంలోని బైపాస్ సర్కిల్ వద్ద ఎస్‌ఐ శివశంకర్ ఆధ్వర్యంలో పోలీసులు ఆదివారం వాహనాల తనిఖీ చేపట్టారు. రికార్డులు లేకుండా వాహనాలు నడిపేవారికి జరిమానా విధించారు. హెల్మెట్ లేకుండా వాహనాలు నడిపేవారికి, కార్లలో సీట్ బెల్టు లేకుండా నడిపేవారికి అవగాహన కల్పించారు.

ఆకాశ కన్నియమ్మకు విశేష పూజలు



అమ్మవారికి పూజలు చేస్తున్న భక్తులు

పాలసముద్రం: మండలంలోని వెంగళరాజుకుప్పం కోనచెరువు సమీపంలో ఉన్న ఆకాశ కన్నియమ్మకు గ్రామస్తులు ఆదివారం విశేష పూజలు చేశారు. ఉదయం అమ్మవారికి పాలు, పెరుగు, తేనె, నెయ్యి, చందన, నారికేళ జలాలతో అభిషేకాలు చేశారు. మధ్యాహ్నం తమిళనాడు రాష్ట్రం అమ్మవారికుప్పంలోని మహిళలు అమ్మవారి ఆలయ ప్రాంగంలో పొంగళ్లు పెటి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. గ్రామస్తులు తెచ్చిన సుగంధ భరిత పుష్పాలతో ఆలయ అర్చకుడు కామత్యాగరాజు అమ్మవారిని సుందరంగా అలంకరించి ప్రత్యేక దీపారాధన చేశారు. భక్తులు అమ్మవారికి కొబ్బరికాయలు కొట్టి కర్పూర హరతులిచ్చి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులుకు అన్నదానం చేశారు.

పగలు భగభగ.. రాత్రి గజగజ



మధ్యాహ్నం నిర్మానుష్యంగా ఉన్న కార్వేటినగరంలో ఓ వీధి



వేకువ జామున దట్టంగా కురుస్తున్న మంచు

- వాతావరణ మార్పులతో ప్రజలు ఇబ్బందులు
- పెరుగుతున్న పగటి ఉష్ణోగ్రత
- రాత్రి దట్టమైన మంచు

వేసవి ప్రారంభంలోనే భానుడు భగభగ మండిపోతున్నాడు. ఫలితంగా జనం బెంబేలెత్తుతున్నారు. మధ్యాహ్న సమయంలో బయటకు రావడానికి జంకుతున్నారు. అయితే రాత్రి వేళ ఇందుకు భిన్నంగా దట్టమైన పొగమంచు కురవడం..చలిగాలుల ప్రభావంతో చలికి గిజగిజ వణికిపోతున్నారు. వారం రోజులుగా వాతావరణంలో వచ్చిన మార్పులు ఇబ్బందులు తెచ్చిపెడుతున్నాయి.

కార్వేటినగరం: పగటి పూట భానుడు ప్రతాపం చూపుతున్నాడు. రాత్రి వేళలో దట్టమైన మంచుకురిసి, చలితో ప్రజలు గిజగిజ వణకాల్సి వస్తోంది. కొన్ని రోజులుగా పగటి పూట ఉష్ణోగ్రతలు క్రమంగా పెరుగుతున్నాయి. అయితే రాత్రి వేళల్లో చలిగాలుల తీవ్రత ఎక్కువగా ఉంటోంది. ఒక్కోరోజు తెల్లవారుజామున పొగమంచు కురుస్తోంది. సాధారణంగా శివరాత్రి వస్తే శివశివా.. అంటూ చలి తీవ్రత తగ్గుతుందని పెద్దలు చెబుతుంటారు. మార్చి మొదటి నుంచి ఎండలు పెరగడం సహజం. అయితే ఎన్నడూ లేని విధంగా కొన్ని రోజులుగా రాత్రి వేళల్లో దట్టమైన మంచు కురుస్తూ చలిగాలులు వీస్తున్నాయి.

వారం రోజులుగా క్రమేణా పగటి ఉష్ణోగ్రతలు దాదాపు 30 నుంచి 32 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. రాత్రి వేళల్లో మాత్రం అందుకు భిన్నంగా ఉష్ణోగ్రతలు తగ్గిపోతూ చలిగాలులు అధిక మవుతున్నాయి. దీనికితోడు అప్పుడప్పుడు ఉదయం పొగమంచు అలుముకుంటుంది. వాతావరణంలో మార్పుల కారణంగా చిన్నారులు, వృద్ధులకు ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారు.

పగలు పెరిగిన విద్యుత్ వినియోగం

వారం రోజులుగా పగటి పూట ఉష్ణోగ్రతలు పెరుగుతుండడంతో విద్యుత్ వినియోగం గణనీయంగా పెరుగుతుంది. రెండు మాసాలు శీతాకాలం కావడంతో ఏసీ, ఫ్యాన్, కూలర్ వినియోగం తగ్గింది. ఒక్కసారిగా వాతావరణంలో మార్పులు రావడంతో ఏసీలు, కూలర్లు, ఫ్యాన్‌ల వాడకంతో విద్యుత్ వినియోగం పెరిగిందని ఆశాఖ అధికారులు చెబుతున్నారు. అలాగే పుచ్చ కాయలు, కొబ్బరి బోండాలు, శీతలపానీయాల వినియోగం కూడా పెరిగింది. ఇలాంటి పరిస్థితుల్లో ప్రజలు ఆరోగ్యంపై అప్రమత్తంగా ఉండాలని వైద్యులు సూచిస్తున్నారు.

అప్రమత్తంగా ఉండాలి



వాతావరణంలో మార్పుల కారణంగా ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. తగినంతగా మంచి నీరు తాగాలి. ముఖ్యంగా చిన్నారులు, వృద్ధులు తీసుకునే ఆహారంలో జాగ్రత్తలు తీసుకోవాలి. ఇలాంటి పరిస్థితుల్లో ఎక్కువగా బయట తిరగడం మంచిది కాదు. వాంతులు, విరేచనాలు వంటివి వస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలి.

–డాక్టర్ రవిరాజు,
జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి, చిత్తూరు

ఘనంగా సంతాన వేణుగోపాలస్వామి ఉత్సవం



సంతాన వేణుగోపాలస్వామి ఊరేగింపు

గంగాధరనెల్లూరు: మండలంలోని మహదేవమంగళం సమీపంలోని సంతాన వేణుగోపాలస్వామి ఆలయంలో 47వ వార్షికోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఉదయం గోపూజ చేశారు. గోమాతను అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. రుక్మిణిసత్యభామ సమేత వేణుగోపాలస్వామి మూలవర్లకు పాలు, పెరుగు, తేనె, పంచామృతం నారికేళజలాలతో అభిషేకాలు చేశారు. సుగంధ భరిత పుష్పాలతో విశేషాలంకరణ చేసి, భక్తులకు దర్శనం కల్పించారు. అనంతరం ఆలయం నుంచి ఉత్సమూర్తులను ఊరేగింపుగా తీసుకొచ్చి విశేషాలంకరణ చేసి, శాస్త్రోక్తంగా హోమం చేశారు. మంగళవాయిద్యాల నడుమ కనులపండువగా కల్యాణోత్సవం జరిపించారు. అనంతరం పుష్పపల్లకిలో ఊరేగించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. రాత్రి ఊంజల్‌సేవ నిర్వహించారు. చుట్టు పక్కల గ్రామాల నుంచి అనేకమంది భక్తులు పాల్గొని, మొక్కులు తీర్చుకున్నారు.

పేర్నాటి గెలుపే ధ్యేయంగా పనిచేద్దాం





ప్రచారంలో మంత్రి సోదరుడు రామ్‌ప్రసాద్ రెడ్డి, పుత్తూరులో ప్రచారం చేస్తున్న కుమారస్వామిరెడ్డి

నగరి: ఎమ్మెల్సీ ఎన్నికల్లో పేర్నాటి గెలుపే ధ్యేయంగా పనిచేద్దామని మంత్రి ఆర్కేరోజా సోదరుడు రామ్‌ప్రసాద్ రెడ్డి అన్నారు. ఆదివారం మున్సిపాలిటీలోని 3,4,5 వార్డుల్లో ఆయన ఎన్నికల ప్రచారం చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పీజీ నీలమేఘం, రాష్ట్ర రెడ్డి కార్పొరేషన్ డైరెక్టర్ చంద్రారెడ్డి, మున్సిపల్ సచివాలయ కన్వీనర్ దయానిధి, కౌన్సిలర్లు గోపాల్‌రెడ్డి, మునికృష్ణారెడ్డి, ఇంద్రయ్య, కోఆప్షన్ సభ్యులు ఎల్లప్పరెడ్డి, నాయకులు సలీమ్, వేణి తదితరులు పాల్గొన్నారు.

సత్రవాడలో..

మున్సిపాలిటీలోని సత్రవాడ దళితవాడలో ఆదివారం సాయంత్రం మంత్రి రోజా సోదరుడు వై రామ్‌ప్రసాద్ రెడ్డి ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం చేశారు. మున్సిపల్ వైస్ చైర్మన్ బాలన్, మొదలియార్ కార్పొరేషన్ డైరెక్టర్ బాలకృష్ణ, చేనేత సంఘం జిల్లా అధ్యక్షుడు కన్నాయిరం, పార్టీ మున్సిపల్ అధ్యక్షుడు బీఆర్వీ అయ్యప్పన్ తదితరులు పాల్గొన్నారు. మండల పరిధి తడుకుపేటలో ఆర్బీకే అధ్యక్షుడు బుజ్జిరెడ్డి ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. వైస్ ఎంపీపీ ఢిల్లీ, నాయకులు నాగవేలు రెడ్డి, వినోద్, జయకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో పేర్నాటిని గెలిపించండి

పుత్తూరు రూరల్: తూర్పు రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బలపరిచిన పేర్నాటి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని మంత్రి ఆర్కే రోజా సోదరుడు వై.కుమారస్వామిరెడ్డి ఓటర్లను అభ్యర్థించారు. ఆదివారం పార్టీ కార్యాలయంలో పుత్తూరు రూరల్ మండలంలోని ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. అనంతరం పట్టణంలో పలు కాలనీల్లోని పట్టభద్రుల వద్దకు వెళ్లి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ మునివేలు, వైస్ ఎంపీపీ విమల, మార్కెట్ కమిటీ చైర్మన్ భాస్కర్‌యాదవ్, తడుకు సింగిల్ విండో ప్రెసిడెంట్ శ్రీనివాసులురెడ్డి, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, గృహసారథులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

వడదెబ్బపై అప్రమత్తత అవసరం



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్ మురళి

పాలసముద్రం: ప్రస్తుతం ఎండల తీవ్రత పెరగడంతో విద్యార్థులు వడదెబ్బకు గురికాకుండా అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందని పీహెచ్‌సీ సూపర్‌వైజర్ మురళి, వార్డెన్ కోటేశ్వరన్ తెలిపారు. ఆదివారం సాయంత్రం ప్రభుత్వ బీసీ బాలుర వసతి గృహంలో విద్యార్థులకు వడదెబ్బపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థుల ఎండల్లో ఎక్కువగా తిరగకూడదన్నారు. ప్రస్తుతం ఎండల తీవ్రత ఎక్కువ కావడంతో వడదెబ్బకు గురయ్యే అవకాశం ఉందన్నారు. ఈ నేపథ్యంలో విద్యార్థులు ఎక్కువగా మజ్జిగ, నీరు తీసుకోవాలని తెలిపారు. ముఖ్యంగా ఓఆర్‌ఎస్ తీసుకుంటే వడదెబ్బకు గురికాకుండా ఆరోగ్యంగా ఉండవచ్చని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

రెండెకరాల చెరుకుతోట దగ్ధం

నగరి (విజయపురం): షార్టు సర్క్యూట్‌తో రెండు ఎకరాల చెరుకు తోట దగ్ధమైన సంఘటన విజయపురం మండలంలోని పాతార్కాడులో ఆదివారం చోటుచేసుకుంది. ఇరుగు పొరుగు రైతులు అగ్నిమాపక వాహనానికి సమాచారం అందజేయగా అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకొనేసరికి రెండెకరాల తోట కాలిపోయింది. కోతకు సిద్ధంగా ఉన్న దశలో అగ్నిప్రమాదం చోటుచేసుకోవడంతో తన కష్టం బుగ్గి అయ్యిందని కౌలు రైతు బాలసుబ్రహ్మణ్యం ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు.

ఆస్పత్రులకు వెళ్లి పింఛన్ల అందజేత







స్విమ్స్‌లో కదిరివేలుకి, రూయాలో మౌలాసాహెబ్‌కి, చెన్నైలో వజ్రవేలురెడ్డికి పింఛన్లు ఇస్తున్న వలంటీర్లు కల్పన, కోకిల, రామకృష్ణ

పాలసముద్రం: ప్రభుత్వం పంపిణీ చేస్తున్న పింఛన్లను అనారోగ్యం కారణంగా అస్పత్రుల్లో చికిత్స పొందుతున్న లబ్ధిదారులకు వలంటీర్లు ఆదివారం ఆయా ప్రాంతాలకు వెళ్లి పింఛన్ అందజేశారు. నరసింహాపురం సచివాలయం పరిధిలోని అయ్యవారికండ్రిగ గ్రామానికి చెందిన కదిరువేలు తిరుపతి స్విమ్స్‌లో అనారోగ్యంతో చికిత్స పొందుతున్నారు. దీంతో వలంటీర్ కల్పన ఆస్పత్రికి వెళ్లి వేలిముద్ర వేసుకుని పింఛన్ పంపిణీ చేశారు. వెంగళరాజుకుప్పం సచివాలయ పరిధిలోని కన్నికాపురం గ్రామానికి చెందిన మౌలాసాహెబ్ తిరుపతి రూయాలో చికిత్స పొందుతున్నాడు. వలంటీర్ కోకిల ఆస్పత్రికి వెళ్లి అతనికి వేలిముద్ర తీసుకుని పింఛన్ నగదు అందించారు.

చెన్నైకి వెళ్లి పింఛన్ అందజేత

నగరి : మండలంలోని మిట్టపాళేనికి చెందిన వజ్రవేలు రెడ్డి వృద్ధాప్య పెన్షన్ లబ్ధిదారుడు. ఆయన ఇటీవల కింద పడి వెన్నుముక గాయంతో చెన్నై పణిమలర్ ఆస్పత్రిలో కొంతకాలంగా చికిత్స పొందుతున్నాడు. ఆయన పరిస్థితిని తెలుసుకున్న మిట్టపాళెం సచివాలయ వలంటీర్ రామకృష్ణ చెన్నైకి వెళ్లి ఆయనకు వృద్ధాప్య పింఛన్ అందజేశాడు. గాయాల పాలై ఆస్పత్రిలో ఉన్నా కొడుకులా తమను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదుకుంటున్నారని వజ్రవేలు రెడ్డి కన్నీరుపెట్టారని వలంటీర్ రామకృష్ణ తెలిపారు.

పశువుల ఆరోగ్యంతోనే అధిక పాల ఉత్పత్తి

పాలసముద్రం: పాడి పశువులు ఆరోగ్యంగా ఉన్నప్పుడే అధిక పాల ఉత్పత్తి, వాటిలో వెన్నశాతం కూడా అధికంగా ఉంటుందని శ్రీజ మహిళ మిల్క్ ప్రొడ్యూసర్ కంపెనీ ఏపీఓ ఈ.మహేశ్వరెడ్డి, పశువైద్యాధికారి భానుచందర్ తెలిపారు. ఆదివారం బాలకృష్ణాపురంలో ఉచిత పశువైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గర్భధారణ చేయించినప్పటి నుంచి ఈనే వరకు పశువులను జాగ్రత్తగా కాపాడుకోవాలన్నారు. పశువు ఈనిన తరువాత మాయ సరిగ్గా వేయక పోతే గర్భకోశవ్యాధులు వచ్చే అవకాశం ఉందన్నారు. పశువు సరిగ్గా ఎదకు రాకపోయినా, సకాలంలో చూడి నిలవకపోయినా వెంటనే వైద్యం చేయించాలన్నారు. అలా చేయకపోతే పశువు గొడ్డుమోత పశువుగా మారుతుందన్నారు. పశువులశాల శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. పుష్టికరమైన పచ్చిమేత సమృద్ధిగా మేపాలన్నారు. అనంతరం పశువులు, దూడలకు పిడుదల నివారణకు మందులు పిచ్చికారీ చేశారు. సబ్సిడీపై దాణా, మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బాలాజీ డెయిరీ సూపర్‌వైజర్ రిగస్ పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణతోనే మనుగడ

పాలసముద్రం: పర్యావరణాన్ని పరిరక్షించుకోవడంతోనే మనిషికి మనుగడ సాధ్యమవుతుందని ఆముదాల సర్పంచ్ అనురేఖ తెలిపారు. ఆదివారం సచివాలయం ఆవరణలో వలంటీర్లలతో కలసి మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. సర్పంచ్ అనురేఖ మాట్లాడుతూ పరిశ్రమలు నుంచి వెలువడే కాలుష్యం, వ్యర్థాలో వాతావరణం కాలుష్యమవుతుందన్నారు. జనాభా పెరుగుదలతో గాలి, నీరు భూమి కలుషితమైన ప్రజలు కీళ్లు, నరాలకు సంబంధించిన వ్యాధుల బారిన పడి ఇబ్బందులు పడుతున్నారు. ఇలాంటి వ్యాధులను అరికట్టాలంటే ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడుకోవాలని తెలిపారు. మొక్కలు పెంచడంతో వాతావరణంలో మార్పులు సంభవించి, వర్షాలు కురుస్తాయని తెలిపారు. తద్వారా కాలుష్యం తగ్గుతుందని చెప్పారు.